# ప్రతిబింబం



చంపకం చెంప చెళ్ళుమంది.

అయిదేళ్ల పాప కెవ్వుమంది.

చంపకం కళ్లల్లో నీరు తిరిగి పద్మంనుంచి రాలిన మంచుబొట్లలా రాలినవి.

ప్రభాకరం కోపం పాలపొంగులా తగ్గిపోయింది. తన ఆవేశానికి సిగ్గుపడి అక్కడ ఉండలేక చెప్పులు తొడుక్కొని చరచరా నడిచిపోయాడు.

రోజూ ఆఫీసుకు అరగంట ఆలస్యంగా వచ్చే ప్రభాకరం ఆ నాడు అందరికంటే ముందుగా వచ్చి 'గుడ్ మార్నింగ్'లు కొడుతూంటే అందరికీ ఆశ్చర్యం వేసింది. రోజూ ఆలస్యం ఎందుకయ్యేది ? అని ఇంకొకప్పుడడిగితే ముద్దుగా సమాధానం చెప్పేవాడు. కానీ ఇప్పుడతని మన స్థితి బాగుండలేదు. మనస్సు బాగుంటే అతడు అస లెప్పుడూ ముద్దుగానే మాట్లాడుతూంటాడు. ఆఫీసులో తోటివారికీ, ఇంటిదగ్గర భార్యకూ అదేకాలక్షేపం, కాలగమనాన్ని మరిపించే మత్తు పదార్థం!

రోజూ ఎందు కాలస్యమవుతుందని ఒకప్పుడడిగితే, పెళ్లానికో ముద్దు, పాపకో ముద్దు ఇచ్చి బయట పడేసరికి అలా అవుతుందని చెప్పేవాడు. (ఆఫీస రడిగితే ఆ నిజం చెప్పడు). 'ఈ వేళ మరి ముందుగా వచ్చావేం ?' అని ఎవరైనా అడిగితే ఏమని చెప్పాలి ? అదీ అతనికి ప్రస్తుత సమస్య. వచ్చినవాళ్లంతా అతన్ని చూడగానే అలాగే అడిగారు. కానీ అంతలోనే అతని ముడుచుకుపోయిన ముఖం అందరినోళ్లూ కట్టివేసింది. ఎప్పుడూ నవ్వుతూ, పేలుతూ ఉండే ప్రభాకరం అలా ఉండటం వాళ్లకేమీ నచ్చలేదు. అతడెప్పుడొచ్చిందీ వాళ్ల కనవసరం. ఎప్పుడొచ్చినా నవ్వుతూ ఉంటేచాలు. ఒక సన్నిహితుడు—అంటే ప్రక్కసీట్లో వాడు—అడగనే అడిగాడు: "ఈ వేళ ముద్దరాలు ముద్దు పెట్టిందా ?'—అని. ప్రభాకరం వంటినిండా తేళ్లు ప్రాకినట్లయింది. అంతలోనే అభిమానమూ పొడుచుకొచ్చింది. తానే చెంపవాయించి మరీవస్తే, తనను నిరాకరించట మేమిటి ? అసలు నిరాకరించటానికి భార్యకేం హక్కు ? అనుకున్నాడు. 'హు' అనుకొని హుందాగా కాలరు పైకెత్తాడు. కాని అంతలోనే తగ్గిపోయింది అభిమానం. మాటి మాటికీ

---

**"పెద్ద వాళ్లం గనక మనుషులకు ఆవేశా లుంటాయని తెలుసుకుంటాం. ఆవేశం తగ్గితే మనుషులవుతారని ఆశిస్తాం. కాని, పసిపిల్ల! దానికేం తెలుసు ఇవన్నీ?" ఏమైనా ఎవరిని నిందిస్తుంది? ఎవరిని సమర్థిస్తుంది ?**

**దెబ్బ తిన్నది తల్లి. వెళ్లగొట్టవలసింది తల్లి. మరి వెళ్ళిపొమ్మని చెప్పదేం ? అదే పాప సమస్య.**

---

పాప, చంపకం—కనులముందు కదులుతున్నారు.

* * *

ప్రభాకరం ఇంటినుంచి బయట పడగానే కదలకుండా ఉన్న పాపకు కొంత ధైర్యం వచ్చింది. ఆ రూపంలో తండ్రిని చూచి బెదిరిపోయింది. అతడు వెళ్లగానే మెల్లగా తల్లి దగ్గరకు చేరింది. చంపకం తమలపాకు వంటి చెంపమీద చిగురుటాకువంటి చేయి ఆన్చి, దెబ్బతిన్నప్పుడల్లా ఉందో అలానే నిలబడి ప్రపంచాన్ని మరచిపోయింది. ఆ కన్నులనుండి కారే కన్నీటికి ఏది కారణమో ?చెంపదెబ్బ నొప్పి కలిగించి ఉండవచ్చు. ఇన్నాళ్లూ ఆదరించిన భర్త అమానుషంగా ప్రవర్తించడం కావచ్చు. మనసిచ్చినవాడు మర్యాదగా ప్రవర్తించక పోవడం కావచ్చు. అన్నింటికీ ఒక్కొక్క అశ్రువు రాల్చింది చంపకం.

పాప దగ్గరికి వచ్చి కాలుకు చుట్టుకుపోయింది.చంపకం ఆలోచనలు ఆగిపోయినయ్. పాపవంక చూచింది. ఒక కన్నీటిబొట్టు పాపమీద రాలింది. ఎందుకో అది అపశకునం అనిపించింది. ఆమెకు. తనచేత్తో తుడిచివేసింది. పైటచెరగుతో పాప కన్నీరు కూడా తుడిచింది.

తల్లి కళ్లల్లోకి చూస్తూ పాప మెల్లగా అంది—"నాన్న మంచాలు కాదమ్మా !" అని. చంపకం ఆశ్చర్యపడింది— అంత దుఃఖంలోనూ! అది తనమీద సానుభూతి కాబోలునని సరిపెట్టుకుంది. పాప నెత్తుకొని హృదయానికి హత్తుకుంది. గదిలోకి వెళ్లి పాపను తనతో పడుకోబెట్టుకుంది. పాప ఆ మౌనాన్ని భరించలేకపోయింది. 'నాన్న నిన్ను కొత్తాలమ్మా !' అంది. చంపకం ఉలకలేదు. పాప పేప తల్లి చెంపలు మృదుహస్తాలతో నిమిరింది.

'అమ్మో!..... చూలవే!... ఇక్కలగీతలు?' ఆమెకు తెలుసు తన చెంపమీద నాలుగు వేళ్ల గుర్తులూ ఉన్నాయని.

ఎందుకొచ్చిందో వచ్చింది తగవు. ఇలా పరిణమించింది. ప్రభాకరం ఇలా ఎప్పుడూ ప్రవర్తించలేదు. అసలతనికి ఇంతకోపం వస్తుందని ఆమె ఎన్నడూ అనుకోలేదు. దెబ్బతిన్న తరువాత భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటే భయం కలుగుతుంది. గతాన్ని తలుచుకుంటే ఆశ కలుగుతుంది. ఎవరికయినా అంతే! ఇప్పుడు చంపకానికీ అంతే ! చంపకం అందరిలాంటిదే! భవిష్యత్తు ఆలోచించుకుంది. భయం వేసింది. గతాన్ని తలుచుకుంది. ఆశ కలిగింది. ధైర్యం వచ్చింది.

తన భర్త తనపట్ల ఇలానే ఎప్పుడూ

---

**"జితేంద్ర"**

విముఖంగా ఉంటే? పాప మనస్సులో తండ్రి చెడురూపం ముద్రపడితే? తన జీవితం ఎలా ఉంటుంది ? తన సంసారం ఏమవుతుంది ? అంతకన్నా నరకం వేరే ఉంటుందా ? అనిపించింది. భయం వేసింది.

మళ్లీ గతాన్ని తలుచుకుంది. అతడెంత సహృదయుడు! ఎంత జాలిగుండె! తనకు ముద్దివ్వకుండా ఒక్కనాడయినా ఆఫీసుకు వెళ్లాడా ? తానంటేనూ, పాపంటేనూ ఎంత ప్రేమ! అలాంటివాడికి ఇంత కోపం ఎలా రావాలి ? తప్పు తనది కాదా ? అయినా క్షమిస్తాడనే ఆమె ధైర్యం. మళ్లీ ఎప్పటి లాగే ఉంటాడని ఆశ!

'నాన్న మంచాలు కాదమ్మా!.. మనింటికి కిరానియ్యొద్దు' అంది పాప తల్లికి ధైర్యం చెపుతున్నట్టు.

"తప్పమ్మా! అలా అనకూడదు! నాన్న గారు కదూ!" అంది చంపకం. పాపకు తండ్రి మీద ఏర్పడిన చెడు అభిప్రాయం నిలిచి పోకుండా చేయాలని ఆమె తాపత్రయం.

"మరి నిన్నెందుకు కొత్తారు? మనింటికి లావొద్దు "

"నాన్న చాలా మంచి వారమ్మా! "

"మరి అమ్మ నెందు క్కొత్తారి?" ఆమె కేం చెప్పాలో తెలియలేదు. ఆలోచిస్తూ వూరుకుంది.

• • •

అక్కడ అందరికంటే ముందుగా వచ్చిన ప్రభాకరం, అందరూ రాకముందే ఆఫీసు నుంచి బయలుదేరాడు. అతనికి అక్కడ ఉండ బుద్ధిగాలేదు. మనసు మనసులో లేదు. ఆనాటికి సెలవు రాసిచ్చి ఇంటికి బయలుదేరాడు.

ఇక్కడ పాపకూడా అన్నం తినలేదని చంపకానికి గుర్తు వచ్చింది. తండ్రితోపాటు తినటం పాప కలవాటు. ఈ వేళ అతడు తిన కుండానే వెళ్ళాడు. పాపా తినలేదు. పెట్టటం తానూ మరిచిపోయింది.

"అన్నం పెడతాను పాపా! చాలా ప్రొద్దెక్కింది!" అంది మంచంమీంచి లేస్తూ.

"నా కొద్దమ్మా!" అంది పాప. చంపకానికి అనుమానం—తన దుఃఖం పాపలో గూడా చోటు చేసుకుందేమోనని!

"ఆకలవుతుంది పాపా!.... పెడతానురా!'

"నా కాకలి గాలేదమ్మా!"

"కొద్దిగా తిందువుగాని."

"మరి నువ్వు గూలా తింతావా?"

ఇందుకా తన కాకలి లేదనటం? మాతృ హృదయంలో తరంగాలు లేచినయ్. కన్నీరుగా పార్లింది ప్రేమ. పాపను మళ్ళీ హృదయానికి హత్తుకుంది.

"ముందు నువ్వు తినమ్మా! నేను తర వాత తింటాను!"

"నేను నీ దగ్గరే తింతా."

"కాదమ్మా! నువ్విప్పుడు తిను. నేను నాన్నగారొచ్చిం తరువాత తింటాను." ఆమెకదే ఆశ—అతడు భోజనానికింటికే వస్తాడని.

"వద్దమ్మా!......నాన్నని మనింతికి లాని యొద్దే! మంచాలు కాదే!" అని పాప మారాం సాగించింది.

ఎగసిన చంపకం హృదయం పగిలిపోయింది. తండ్రిని ఇంతగా ద్వేషిస్తుం దేమిటి? ఏం చెపితే తెలుస్తుంది? ఎలా చెప్పాలి?.... ఎవరో వీధి తలుపుతీసిన చప్పుడు. ఇంట్లోకి వస్తున్న చెప్పుల చప్పుడు. ఇంకెవరు? ఆయనే! చంపకం మళ్ళీ సంతోషించింది. ముఖపద్మం వికసించింది. లేచి నిలబడింది స్వాగతమివ్వాలని. ఎదురుగా భర్త!.... ప్రభాకరం రానే వచ్చాడు! ఎంత ఆనందం. తనకు తెలుసు తిరిగి వస్తాడని. అతని కౌగిలిలో నలిగి పోవాలని ఉత్సాహం ముందుకు నెడుతూంది. కాని ఎందుకో సిగ్గు. తాను మళ్ళీ కొత్త పెళ్ళికూతురయింది. అడుగు కదపలేదు. తల పైకెత్తలేదు. తాను కోరినవాణ్ణి తన కళ్ళతో చూడలేదు.

చంపకానికి చెంపపెట్టు పెట్టిన తన చేతిని ప్రభాకరం ఎంతగానో నిందించు కున్నాడు. తన భార్య తనను క్షమిస్తుందనే ధైర్యం ఉంది. క్షమించకపోతే, క్షమార్పణ కోరుకుంటాడు. క్షమించమని ఆజ్ఞాపిస్తాడు. భర్తగదా! తప్పకుండా క్షమిస్తుంది. ఆమె చెప్పనక్కర్లేదు. ఆ ముఖంలోని కాంతి, అర్థ నిమీలిత నేత్రాలు, తీగలా వణికిపోయే తనువు—ఆ భావం తనకు తెలియదా?

"అమ్మా! నాన్నొచ్చారే! పొమ్మనవే!" అంటూ పాపం ముఖం దాచుకుంది.

భార్యా భర్త లిద్దరూ మళ్ళీ వూహాలోకంలోంచి ఆ గదిలోకి దిగారు. ఇంతకు ముందు పాప ఉన్నసంగతే మరిచిపోయారు. అదే వారి ప్రథమ సమాగమం అన్నంత ఉత్సాహంగా ఉన్నారు .. తమకూ ఒక పాప ఉంది.



హోం సినిమా ప్రొజెక్టర్
రు. 15/—



ఇంటివద్ద అద్భుతమైన వినోదము

మీ స్వంత యింట్లో మా ప్రొజెక్టరుతో సినిమాలోని సాహస కృత్యములు, ప్రేమకలాపాలు మొదలైనవి చూచి ఆనందించండి. టార్చిలైటు గాని ఏసి డిసి ఎలెక్ట్రిసిటీగాని వాడవచ్చును. ఫిలిం 35 ఎం. ఎం. బొమ్మలు స్క్రీన్ మీద కదులుతూ నాట్యం చేస్తూ వినోదం కలిగిస్తాయి. ధర రు. 15లు. 40అ.ఫిలిం మరియు 4'×3' సైజ్ స్క్రీను.ఫిలించూపించేవిధంఉచితం.పోస్టేజి రు. 4—50 న. పై. అదనం డీలక్సు స్పెషల్ ప్రొజెక్టరు ధర రు. 25 లు 60 అ. ఫిలిం 4'×3' సైజ్ స్క్రీను. ఫిలిం చూపించేవిధం ఉచితం. పోస్టేజ్ రూ. 5/— అదనం. గిరాకీ విశేషంగాఉంది. నేడే ఆర్డరు పంపండి.

**HOLLYWOOD CINEMA CORP. (Regd.),**
**2194, Kalyanpura Turkman Gate, (7)**
**DELHI-6.**

తాంబూలములకు
...వంగము యిప్పుడు అక్కరలేదు.

రూచి 


సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.
నానాకాస్మటిక్సు, విజయవాడ—2.

స్థాపితం 1920
రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)
గోపాలపురం తూ.. గో.. జిల్లా
కుష్ఠు బొల్లి మేహపాద వగైరా చర్మ సుఖ వ్యాధులకు శాస్త్రీయ ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము.

బ్రాంచీలు : నెల్లూరు — కాపువీధి,
సికింద్రాబాద్ — 3560 కింగ్సువే



పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AV-3) Jullundur City.**

## ప్రతిబింబం

ఎంత గర్వకారణం? కాని, కాని, ఏమంటూంది పాప?

"పొమ్మనవే!......మనింటికి రానియ్యొద్దే!"

సుఖము, దుఃఖము, సంతోషము, బాధ, ఆశ, నిరాశ—అన్నీ ఒక్కసారే ఎలా అనుభవించగలుగుతుంది? అనుభవించక చేయగలిగిందేముంది—కన్నీరు కార్చటం తప్ప?

"పా.....పా....!" అని బ్రతిమాలుకుంది. తన భర్తను, తాను చేయని తప్పుకు దండించి, తనకు తానే తిరిగి వచ్చి క్షమించిన భర్తను, ఏమనటానికీ ఆమె ఒప్పుకోదు. ఆమె భార్య. అత డామె భర్త. ఆ సంబంధం ఎంత పనయినా చేయిస్తుంది.

నాన్న రావటం అమ్మకే ఇష్టం ఉండదేమోనని పాప ఆశ! దెబ్బ తిన్నది అమ్మ! వెళ్ళగొట్టవలసింది అమ్మ! మరి ఎందుకు రానిచ్చింది ఇంట్లోకి? వెళ్ళిపొమ్మని చెప్పదేం? అదే పాపకు అర్థం కాలేదు.

ప్రభాకరానికి అసలు కథే అర్థం కాలేదు.

"ఏమిటిది చంపకం?" అన్నాడు.

ఏమని చెపుతుంది? అటు భర్త! ఇటు పాప! ఎవర్ని నిందిస్తుంది? ఎవర్ని సమర్థిస్తుంది? ఎలా సమన్వయిస్తుంది?

"చేసినవారికి తెలియంది, అనుభవించిన వాళ్ళకు మాత్ర మేం తెలుసు?" అంది.

ప్రభాకరం నిర్విణ్ణుడయ్యాడు. తనను పూర్తిగా క్షమించిం దనుకున్నాడు. ఏమిటీ ధోరణి?

చేతులలో ఉన్న పాప తన్నుకుంటూంది. "నిన్ను కొల్తాలు......పొమ్మనవే!" అంటూ ఏడుస్తూంది. ఆమె కేం చేయటానికీ తోచడం లేదు. మళ్ళీ పాపను తల నిమిరి బ్రతిమాలుకుంది:

"తప్పు పాపా!.... అలా అనకూడదమ్మా!" అని. పాప వినలేదు.

"మంచాలు కాదే......" అంటూ తన్నుకుంటూంది. ఇక సహించలేకపోయింది చంపకం.

"పాపా!" అని గట్టిగా అరిచింది. పాప ఉలిక్కిపడి తల్లి ముఖంలోకి చూచింది. అందులోని భావాలు అర్థంకాక ఏడ్చింది. తన తల్లి కంఠంలో అంతటి కాఠిన్యం ఉంటుందని పాప కంతవరకూ తెలియదు. తన భార్య కోపాన్ని ప్రదర్శించగలదనే విషయం ప్రభాకరానికీ తెలియదు.

పాప కెటూ పాలుపోలేదు. తండ్రి మంచివాడు కాదు. తానే వద్దన్నది. తనను అమ్మ వద్దంటున్నది. తను నిస్సహాయురాలుగా బాధపడుతూంది పాప. ఏకాకి తాను.... మెల్లగా